సాక్షి
వికారాబాద్
శనివారం, 26, ఆగస్టు, 2023



గోపాలమిత్రల గోడు పట్టదా?

పశువులకు వైద్య చికిత్స చేరువ చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం 2001లో 'గోపాలమిత్ర'కు శ్రీకారం చుట్టింది. 10లో▸



బీజేపీ గెలుపునకు కృషి

రాష్ట్రంలో బీజేపీ గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలని కర్ణాటక రాష్ట్ర హడగల్లి ఎమ్మెల్యే కృష్ణ నాయక్ అన్నారు. 10లో▸



అన్నదాత కలవరం

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పత్తి పంట వేసిన రైతులు నష్టపోయారు. తెగుళ్ల బెడద రైతులకు శాపంగా మారింది. 11లో▸



యాలాలలో ఇంద్రధనుస్సు

నీలాకాశంలో రంగుల సింగిడి

నీలాకాశంలో శుక్రవారం సాయంత్రం రంగుల సింగిడి (ఇంద్రధనుస్సు) అలరించింది. ఉదయం నుంచి భానుడి భగభగతో పరేషాన్ అవుతున్న ప్రజలకు కాసేపు నయనానందాన్నిచ్చింది. తాండూరు పట్టణం, యాలాల, పెద్దేముల్ మండలాల్లో భానుడు పసుపువర్ణంలో అస్తమిస్తుండగా.. ఆకాశంలో ఇంద్రధనుస్సు ఏర్పడింది. దాదాపు గంటపాటు ప్రజలకు కనువిందు చేసింది. ఈ సుందరమైన దృశ్యాలను 'సాక్షి' తన కెమెరాలో బంధించింది.



తాండూరు పట్టణంలో అలరించిన రెయిన్‌బో

న్యూస్‌రీల్

కొనసాగుతున్న దరఖాస్తుల పరిశీలన

యాలాల: జిల్లాలోని వివిధ గ్రామాల్లో దళిత బంధు దరఖాస్తుల పరిశీలన రెండోరోజు (శుక్రవారం) జోరుగా కొనసాగింది. దళితబంధు సహాయం కోసం వివిధ గ్రామాల నుంచి 198 దరఖాస్తులు రాగా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయా గ్రామాల్లో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి దరఖాస్తుదారుల వివరాలను సేకరిస్తున్నారు. ఎంపీఓ యాదయ్య రాస్నం గ్రామ పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తులను పరిశీలించారు. రెండో విడతలో భాగంగా ప్రతి గ్రామానికి 8 నుంచి 10 మంది లబ్ధిదారులకు ఆర్థికసాయం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

పంటల వివరాలు నమోదు చేసుకోవాలి

జిల్లా వ్యవసాయాధికారి గోపాల్



చౌడాపూర్‌లో పంటలను పరిశీలిస్తున్న గోపాల్

కుల్కచర్ల: రైతులు తాము సాగుచేస్తున్న పంటల వివరాలను వ్యవసాయ అధికారుల వద్ద తప్పక నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ అన్నారు. చౌడాపూర్ గ్రామంలోని వ్యవసాయ పొలాల్లో పంటలను శుక్రవారం ఆయన పరిశీలించారు. రైతులు వానాకాలంలో వేసిన పంటలకు సంబంధించిన వివరాలను వ్యవసాయ విస్తరణ అధికారులకు అందించాలని సూచించారు. సర్వే నంబర్ ఆధారంగా పంటలను నమోదు చేయడం ద్వారా కొనుగోళ్ల సమయంలో ఈజీగా ఉంటుందని అన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారి విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

నిరవధిక సమ్మెకు దిగుతాం

ఔట్‌సోర్సింగ్ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నయ్య



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

వికారాబాద్ అర్బన్: మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికుల శ్రమను గుర్తించి వారిని వెంటనే రెగ్యులరైజ్ చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నయ్య డిమాండ్ చేశారు. కార్మికులు చేపట్టిన సమ్మెలో భాగంగా శుక్రవారం పట్టణంలో పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నయ్య మాట్లాడుతూ.. కరోనా లాంటి విపత్కర సమయంలోనూ ఎంతో సేవ చేశామని తమ సేవను ప్రభుత్వం గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ డిమాండ్లను పరిష్కరించకుంటే ఆగస్టు ఒకటవ తేదీ నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు నాగేందర్ గౌడ్, జగదీష్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఐఆర్ ప్రకటించాలి

అనంతగిరి: సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు వెంటనే పీఆర్సీ కమిటీని నియమించి ఐఆర్ ప్రకటించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలకుర్తి కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. శుక్రవారం వికారాబాద్‌లోని యూటీఎఫ్ కార్యాలయంలో పెన్షనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కృష్ణమూర్తి మాట్లాడుతూ.. అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో గరిష్ఠ పరిమితి లేని క్యాష్‌లెస్ ట్రీట్మెంట్ కల్పించాలన్నారు. పెన్షనర్లందరూ ఏకతాటిపైకి వచ్చి హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు సీతారాం, రాములు, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అనంతుని సేవలో ఎర్రోళ్ల శ్రీనివాస్



అనంతగిరి: వికారాబాద్ పట్టణ సమీపంలోని అనంతగిరి గుట్ట శ్రీ అనంతపద్మనాభ స్వామిని శుక్రవారం రాష్ట్ర వైద్య మౌలిక వసతుల సదుపాయాల సంస్థ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఆయనకు తీర్థప్రసాదాలు అందించి ఘనంగా సన్మానించారు.

'గర్జనకు' హస్తం రెడీ

నేడు చేవెళ్లలో ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ సభ

- ఏర్పాట్లను పూర్తిచేసిన కాంగ్రెస్ నేతలు
- సీనియర్ నాయకులకు జనసమీకరణ బాధ్యతలు
- జిల్లా నుంచి 50–60వేల మందిని తరలించేలా ప్లాన్
- ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షిస్తున్న పార్టీ చీఫ్ రేవంత్‌రెడ్డి



సభావేదిక వద్ద ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, నేతలు

వికారాబాద్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా చేవెళ్లలో చేపట్టనున్న ప్రజాగర్జన సభకు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సర్వం సిద్ధం చేశారు. ఈ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ముఖ్య అతిథిగా హాజరవుతున్న నేపథ్యంలో ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లకు తావివ్వకుండా దగ్గరుండి మరీ సభాస్థలి, పార్కింగ్, కార్యకర్తలకు భోజన ఏర్పాట్లు తదితర పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. భారీ జన సమీకరణ చేపట్టి అధికార బీఆర్ఎస్ పార్టీకి తమ సత్తా చూపిస్తామని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. ఈ క్రమంలో సభ నిర్వహణ బాధ్యతలను వికారాబాద్ జిల్లాకు చెందిన మాజీ మంత్రి, సీనియర్ నేత గడ్డం ప్రసాద్‌కుమార్‌కు కట్టబెట్టగా.. పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి కూడా జిల్లానుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న నేపథ్యంలో సభను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నారు. ఇటీవల జిల్లాకు చెందిన ఓ మాజీ ఎమ్మెల్యేతో పాటు పలువురు ముఖ్య నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరడం, అధికార బీఆర్ఎస్ పార్టీ టికెట్ దక్కని అసంతృప్తులు కూడా కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సముఖత చూపుతుండటంతో ఆ పార్టీ మంచి ఊపుమీద కనిపిస్తోంది. ఖర్గే సభను విజయవంతం చేయటం ద్వారా శ్రేణుల్లో మరింత జోష్ నింపడం కోసం జిల్లా నేతలు ఉవ్విళ్లూరుతున్నారు.

సెంటిమెంట్ రిపీటయ్యేనా..?

దివంగత నేత వైఎస్సార్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చేవెళ్ల ప్రాంతాన్ని సెంటిమెంట్‌గా భావించి ఇక్కడి నుంచే అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టేవారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ఆయన చేపట్టిన సుదీర్ఘ పాదయాత్ర కూడా ఇక్కడి నుంచి ప్రారంభించిన విషయం తెలిసిందే. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కూడా ప్రధాన మంత్రి మన్మోహన్‌సింగ్, సీఎం వైఎస్సార్ చేవెళ్ల నియోజకవర్గం నుంచే జాతికి అంకితం చేశారు. ఈ ప్రాంతం నుంచి ప్రారంభించిన ప్రతి కార్యక్రమం విజయవంతం కావడంతో.. తిరిగి అదే సెంటిమెంట్ పునరావృతం అవుతుందని ఆ పార్టీ నేతలు గంపెడాశలు పెట్టుకున్నారు.

భారీ జనసమీకరణ..

జిల్లా పరిధిలోని వికారాబాద్, పరిగి, తాండూరు, కొడంగల్ నియోజకవర్గాలు చేవెళ్లకు సమీపంలో ఉండటంతో పాటు రూరల్ ప్రాంతాలు అయినందున ఇక్కడి నుంచే భారీ జనసమీకరణ చేపట్టాలని ఆ పార్టీ యోచిస్తోంది. ఒక్కో నియోజకవర్గం నుంచి దాదాపు 15వేల మంది చొప్పున మొత్తం జిల్లా నుంచి 50 వేల వరకు జన సమీకరణ చేపట్టాలంటూ స్థానిక నేతలకు టార్గెట్ విధించినట్లు సమాచారం.

50వేలకు పైగా జనసమీకరణ



చేవెళ్ల నుంచే గతంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నో పథకాలు, కార్యక్రమాలు చేపట్టి విజయం కూడా సాధించింది. అదే సెంటిమెంట్‌ను ఖర్గే సభ ద్వారా తిరిగి ప్రజల్లోకి తీసుకెళ్తాం. ఎంతో కీలకమైన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను చేవెళ్ల సభ ద్వారా ఖర్గే ప్రకటిస్తారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే వాటిని అములుచేస్తాం. జిల్లా నుంచి 50 వేలకు పైగా జనసమీకరణ చేపట్టనున్నాం. బీఆర్ఎస్ వైఫల్యాలను సభావేదికగా ఎత్తిచూపుతాం. చేవెళ్ల సభ చరిత్రలో నిలిచిపోతుంది.

– రామ్మోహన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు, వికారాబాద్ జిల్లా

'ఓవర్ టు గాంధీభవన్'

- కాంగ్రెస్ ఎమ్మెల్యే టికెట్ కోసం ముగిసిన దరఖాస్తు గడువు
- తాండూరు సీట్ కోసం అత్యధికంగా ఆరు దరఖాస్తులు

వికారాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా పోటీచేయాలనుకునే ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించే గడువు శుక్రవారంతో ముగిసింది. వికారాబాద్ జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల నుంచి పదిమంది సభ్యులు తమకు ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలని దరఖాస్తు చేసుకున్నారు. కొడంగల్, వికారాబాద్ నియోజకవర్గాల నుంచి ఒక్కోదరఖాస్తు రాగా.. పరిగి నుంచి 2, తాండూరు నుండి అత్యధికంగా ఆరుగురు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో టికెట్ల కేటాయింపులో కాంగ్రెస్‌లోనూ పోటీ అనివార్యమయ్యింది.

హాట్‌సీట్.. తాండూరు

ఇన్నాళ్లు అధికార బీఆర్ఎస్‌లో తాండూరు టికెట్ కేటాయింపు అంశం ఎంత వేడిరాజేసిందో అందరికీ తెలిసిందే. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ టికెట్ల కేటాయింపు విషయంలోనూ అదే పరిస్థితి తలెత్తింది. వికారాబాద్ నుంచి పోటీ చేసేందుకు మాజీమంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ దరఖాస్తు చేసుకున్నారు. పరిగి నుంచి డీసీసీ అధ్యక్షుడు టీ.రామ్మోహన్‌రెడ్డితో పాటు డీసీసీ ప్రధాన కార్యదర్శి, ఆర్టీసీ యూనియన్ రాష్ట్ర నాయకుడు కే.హన్మంతు దరఖాస్తు చేసుకున్నారు. ఇక తాండూరు నుంచి ఏకంగా ఐదుమంది నేతలు దరఖాస్తు చేసుకున్నారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు రమేశ్‌మహరాజ్, టీపీసీసీ జనరల్ సెక్రెటరీ రఘువీరారెడ్డి, పెద్దేముల్ జెడ్పీటీసీ సభ్యుడు ధారాసింగ్, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, వికారాబాద్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త శ్రీరాంరెడ్డి తాండూరు టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో ఉన్నారు. అయితే గతంలో ఎమ్మెల్యేగా పనిచేసిన కేఎల్ఆర్ తాండూరు నుంచి దరఖాస్తు చేసుకోవటం హాట్‌టాపిక్‌గా మారింది. ఆయనకు టికెట్ కేటాయిస్తే బీఆర్ఎస్ అభ్యర్థికి గట్టి పోటీనిచ్చే అవకాశం ఉంటుందనే ఆయన్ను కాంగ్రెస్ అధిష్ఠానం అక్కడినుంచి పోటీ చేయించేందుకు చూస్తోందనే చర్చ మొదలైంది.

ముదిరాజ్‌లకు 18 సీట్లు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న వీరేశ్

అనంతగిరి: రాష్ట్రంలో ఏపార్టీ అయినా ఎమ్మెల్యే అభ్యర్థులకు సంబంధించి ముదిరాజులకు 18 సీట్లు కేటాయించాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ తనయుడు కాసాని వీరేశ్ ముదిరాజ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం వికారాబాద్ పట్టణంలోని తేజ ఫంక్షన్‌హాల్‌లో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ అధ్యక్షతన జిల్లా ముదిరాజ్ సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వీరేశ్ మాట్లాడుతూ.. అధికార బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలో ముదిరాజ్‌లకు ఒకసీటు కూడా కేటాయించలేదన్నారు. ఈవిషయమై ముదిరాజ్‌లు ఏకతాటిపైకి రావాలన్నారు. వికారాబాద్ జిల్లాలోని ఒక రిజర్వ్ నియోజకవర్గం మినహా మిగిలిన మూడు నియోజకవర్గాల్లో ముదిరాజ్‌లకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. టీడీపీ విడుదల చేయబోయే అభ్యర్థుల లిస్టులో బీసీలకు 60 సీట్లు కేటాయించనున్నారన్నారు. మనం మన సత్తాను ఓటుతో చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ తాండూర్ ఇన్‌చార్జి చంద్రశేఖర్, ముదిరాజ్ సంఘం జిల్లా నాయకులు నర్సింహులు, శివరాజ్, పాండు, గోపాల్, అంజయ్య, మాణిక్యం, రాఘవేందర్, నాగేశ్వర్, కర్ణం రఘు, సతీష్, నాగయ్య, లక్ష్మణ్, వేణు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు ఐక్యత చాటాలి

- యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య

అనంతగిరి: సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య డిమాండ్ చేశారు. వికారాబాద్‌లోని యూటీఎఫ్ కార్యాలయంలో శుక్రవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న జంగయ్య మాట్లాడుతూ.. 317 జీఓతో స్థానికతను కోల్పోయిన ఉపాధ్యాయ ఉద్యోగులు ఉద్యమంలోకి రావాలని పిలుపునిచ్చారు. మన హక్కులను సాధించేవరకు ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్దాం అన్నారు. సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లోని ధర్నాచౌక్ వద్ద జరిగే నిరసన కార్యక్రమానికి ఉద్యోగులు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఉద్యోగులు ఐక్యత చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పోచయ్య, కొండయ్య, వెంకటరత్నం, బాబురావు, రత్నం, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

- ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి



పాలేపల్లి జీపీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

దోమ: గ్రామీణ ప్రాంతాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. దోమ మండల పరిధిలోని పాలేపల్లిలో సర్పంచ్ యశోద, వైస్ ఎంపీపీ మల్లేశంతో కలిసి పంచాయతీ భవనం, సీసీ రోడ్డు, కల్వర్టు నిర్మాణ పనులకు శుక్రవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అలాగే మండల కేంద్రంలో సర్పంచ్ రాజిరెడ్డితో కలసి ఆరోగ్య రథం సేవలను ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య రథంలో వైద్యసేవలతో పాటు అవసరమైన మందులను పంపిణీ చేస్తారని తెలిపారు. ఆరోగ్య రథం సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎపీఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఖాజాపాషా, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు లక్ష్మయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోపాల్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, యూత్ అధ్యక్షుడు మశ్చేందర్‌రెడ్డి, ఐనాపూర్ సర్పంచ్ మల్లేశ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం

పరిగి: బీఆర్ఎస్ ప్రభుత్వంలో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. పట్టణ కేంద్రంలోని బృందావన్ గార్డెన్‌లో శుక్రవారం వికలాంగుల పెన్షన్ పెంపు ప్రొసీడింగ్ పత్రాలను ఆయన అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు ప్రభుత్వం వికలాంగులకు రూ.3,016 పెన్షన్ ఇచ్చేదని తాజా పెంపుతో రూ.4,016 పెన్షన్ అందుతోందని అన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్, ఎంపీపీ అరవింద్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ భాస్కర్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, పూడూర్ జెడ్పీటీసీ మేఘమాల, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- కలెక్టర్ నారాయణరెడ్డి
- కాగ్నానదిపై వంతెనను త్వరగా పూర్తిచేయించాలని ఆదేశం
- హరితహారం మొక్కలు ఎండిపోవడంపై సీరియస్
- తీరుమారకుంటే వేటుతప్పదని హెచ్చరిక



ధారూరు: కాగ్నానది వంతెన పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ధారూరు: విధుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ నారాయణరెడ్డి స్పష్టం చేశారు. ధారూరు మండలంలోని కాగ్నానదిపై నిర్మిస్తున్న వంతెన పనులను శుక్రవారం కలెక్టర్ పరిశీలించారు. ధారూరు నుంచి స్టేషన్‌ధారూరు వరకు రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కల జాడేదని, వాటి సంరక్షణ ఎవరు తీసుకున్నారని అధికారులను నిలదీశారు. అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా 9 సంవత్సరాలుగా మనం మొక్కలు నాటుతూనే ఉన్నామని.. అయితే వాటి సంరక్షణ బాధ్యత తీసుకోకపోవడంపై అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. ఎంపీడీఓగా మీకు జవాబుదారీతనం లేదా అని చంద్రశేఖర్‌ను ప్రశ్నించారు. స్థానిక ఏపీఓ, టెక్నికల్ అసిస్టెంట్లు పనితీరును మెరుగుపరుచుకోకుంటే వారిని శాశ్వతంగా విధుల నుంచి తొలగిస్తామని కలెక్టర్ హెచ్చరించారు. స్టేషన్‌ధారూరులో వైకుంఠధామం, పల్లె ప్రకృతివనాల నిర్వహణ, అవెన్యూ ప్లాంటేషన్‌పై నిర్లక్ష్యం వహించిన గ్రామ కార్యదర్శికి చార్జిమెమో ఇవ్వాలని ఎంపీడీఓ చంద్రశేఖర్‌ను ఆదేశించారు. కాగ్నానదిపై నిర్మిస్తున్న వంతెనను వీలైనంత త్వరగా పూర్తిచేయించాలని ఆర్అండ్‌బీ ఈఈ లాల్‌సింగ్‌ను కలెక్టర్ ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారి మల్లేశం, తహసీల్దార్ భువనేశ్వర్, ఎంపీఓ షఫీఉల్లా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

టార్గెట్ పూర్తిచేయాలి

వికారాబాద్ అర్బన్: స్వాతంత్ర భారత వజ్రోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా ప్రజాప్రతినిధుల సహకారంతో జిల్లాకు కేటాయించిన 5లక్షల30వేల మొక్కలు నాటే కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం చేపట్టే హరితహారం కార్యక్రమంపై ఆయా మండలాల అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వజ్రోత్సవాల ముగింపులో భాగంగా నేడు రాష్ట్రవ్యాప్తంగా కోటి మొక్కలు నాటుతున్న సందర్భంగా జిల్లాలో 5లక్షల 30వేల మొక్కలు నాటేందుకు టార్గెట్ ఇచ్చారని తెలిపారు. గ్రామపంచాయతీల్లోని పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠధామాలు, నర్సరీలు, డంపింగ్ యార్డుల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని ఆదేశించారు. గ్రామ కార్యదర్శులు, ఎంపీఓలు ఆయా పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగ్యా నాయక్, డీఆర్ఓ కృష్ణన్, ఆర్డీఓలు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులు చేపట్టండి

బంట్వారం: నిధులు మంజూరైన రోడ్లకు సంబంధించి వెంటనే నిర్మాణ పనులు చేపట్టాలని లేదంటే బ్లాక్‌లిస్టులో పెడుతామని కలెక్టర్ నారాయణ రెడ్డి సంబంధిత కాంట్రాక్టర్లను హెచ్చరించారు. శుక్రవారం ఆయన కోట్‌పల్లి మండలంలోని కరీంపూర్, మోత్కుపల్లి, బార్వాద్, కరీంపూర్ రోడ్డు మార్గంలో ఎవెన్యూ ప్లాంటేషన్‌ను పరిశీలించారు. రోడ్ల మరమ్మత్తులు, పారిశుద్ధ్యం, మెగా ప్లాంటేషన్ పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. దెబ్బతిన్న రోడ్లకు వారం రోజుల్లో మరమ్మతులు చేపట్టాలని ఆర్అండ్‌బీ అధికారులకు సూచించారు. స్పెషల్ ఆఫీసర్ రాజేశ్వర్, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పొలం ధ్వంసంపై ఫిర్యాదు

తాండూరు టౌన్: తన పంట పొలాన్ని కొందరు వ్యక్తులు ధ్వంసం చేశారంటూ ఓ రైతు శుక్రవారం తాండూరు డీఎస్పీ శేఖర్ గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. పెద్దేముల్ మండలం హన్మాపూర్ గ్రామానికి చెందిన పెంటయ్య అనే రైతు సర్వే నంబర్ 56/అలో ఇనాముగా పెద్దల నుంచి వారసత్వంగా సంక్రమించిన భూమిలో పది సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నట్లు తెలిపారు. అయితే హన్మాపూర్ గ్రామానికి చెందిన లొంక బాలరాజు, లొంక రాములు, లొంక మహిపాల్, పంజుగుల శ్రీను పంట పొలాన్ని ధ్వంసం చేసి, కబ్జాకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ ఫిర్యాదులో పేర్కొన్నారు. వీరి నుంచి తనకు రక్షణ కల్పించాలని, అలాగే న్యాయం చేయాలని రైతు కోరారు.

యువతి ఆత్మహత్య


నవనీత మృతదేహం

మర్పల్లి: మండలంలోని దామస్తాపూర్‌లో ఓ ప్రైవేటు క్లీనిక్‌లో పనిచేస్తున్న నర్సు ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన నవనీత(24) సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు క్లీనిక్‌లో నర్సుగా పని చేస్తోంది. నిత్యం ఇంటి నుంచి విధులకు వెళ్లి వచ్చేది. గురువారం క్లీనిక్‌కు వెళ్లలేదు. తల్లి మొగులమ్మ పొలం పనులకు వెళ్లింది. సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా నవనీత విగతజీవిగా కనిపించింది. విషయం తెలుసుకున్న మర్పల్లి పోలీసులు శుక్రవారం గ్రామానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతురాలు తల్లి మొగులమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అరుణ్‌కుమార్ గౌడ్ తెలిపారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

ఆత్మహత్య చేసుకున్న నవనీత అంత్యక్రియల నిమిత్తం ఎస్‌కేఆర్ ట్రస్టు వ్యవస్థాపకులు కొండల్‌రెడ్డి నవనీత రూ. 5 వేలు పంపారు. అదే విధంగా గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ యాదవరెడ్డి రూ. 2,500, బూచన్‌పల్లి ఎంపీటీసీ బాల్‌రెడ్డి రూ. 2 వేలు పంపారు.

ఒక్క చాన్స్ ప్లీజ్


సీఎం కేసీఆర్‌ను కలిసిన శుభప్రద్ పటేల్

తాండూరు టౌన్: తాండూరు నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం కల్పించాలని బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ సీఎం కేసీఆర్‌ను కోరారు. గురువారం సచివాలయంలో సీఎంను కలిశారు. అనేక సేవా కార్యక్రమాలతో తాండూరు ప్రజలతో మమేకమై ఉంటున్నానని, బీసీలు, లింగాయత్‌ల జనాభా అధికంగా ఉన్న స్థానం నుంచి తనకు అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు.

గోపాలమిత్రల గోడు పట్టదా?

- పాడి పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తున్న సిబ్బంది
- సేవలకు గుర్తింపు లేదని ఆవేదన
- ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి


లేగదూడకు ట్యాగ్ వేస్తున్న గోపాలమిత్ర

కొడంగల్ రూరల్: పశువులకు వైద్య చికిత్స చేరువ చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం 2001లో 'గోపాల మిత్ర'కు శ్రీకారం చుట్టింది. పశు వైద్యశాలలకు దూరంగా గ్రామాల్లో పశువులకు వైద్యసేవలు(ప్రథమ చికిత్సలు) అందించేందుకు మండలంలో ఆసక్తి ఉన్న ఒకరిద్దరిని గోపాలమిత్రలుగా నియమించింది. ప్రారంభంలో సేవలందించినందుకు గాను గోపాలమిత్రలకు రైతులకు తోచినంత ఇస్తే సరిపుచ్చుకునేవారు.

చాలీచాలని వేతనాలు

పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే వ్యాధి నిరోధక టీకాల సమయంలో గోపాలమిత్రలు వైద్యులకు చేదోడువాదోడుగా పనిచేస్తుంటారు. తెలంగాణ వ్యాప్తంగా 1,530మంది పనిచేస్తున్నారు. 2009లో నాటి ముఖ్యమంత్రి దివంగత డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి గోపాలమిత్రల సేవలను గుర్తించి గౌరవ వేతనంగా రూ.2 వేలు అందజేశారు. ఉమ్మడి రాష్ట్రంలో గోపాలమిత్రలు వేతనాలు పెంచాలంటూ ధర్నాలు, నిరసనలు వ్యక్తం చేయగా.. 2012లో ముఖ్యమంత్రి రోశయ్య రూ.3,500లకు పెంచారు. 2019లో ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.8,500లకు వేతనం అందించేందుకు చర్యలు తీసుకున్నారు. 2022లో పీఆర్‌సీ పెంచుతూ రూ.11,050 అందజేస్తున్నారు. రెగ్యులర్ అవుతుందనే ఆశతో ఇంత కాలంగా చాలీచాలని వేతనాలతో కాలం గడుపుతున్నామని గోపాలమిత్రలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముర్రజాతి పశువుల అభివృద్ధికి కృషి

పశువులు అనారోగ్యానికి గురైతే రైతుల ఇళ్లు, బావి వద్దకు వెళ్లి వాటికి గోపాలమిత్రలు వైద్యసేవలు అందిస్తారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సీజన్‌లో నిర్వహించే పశువైద్య శిబిరాలలో ముఖ్యపాత్ర పోషిస్తారు. ప్రభుత్వ పశు వైద్య సిబ్బందితో కలిసి పశువులు, మేకలు, గొర్రెలు తదితరవాటికి వ్యాధి నిరోధక టీకాలను వేస్తారు. గోపాలమిత్రలు ఉన్న గ్రామాలు, పరిసర ప్రాంతాల్లో పశువులకు కృత్రిమ గర్భధారణ(ఎద సూది) ఇస్తారు. సంకరజాతి, మేలుజాతి పశువుల అభివృద్ధికి వీరి కృషి ఎంతగానో ఉంటుంది. నాటుజాతి, దేశవాళి పశువుల ద్వారా పాల ఉత్పత్తి తక్కువగా ఉంటుందని, జెర్సీ, ఎచ్‌ఎఫ్, ముర్రజాతి పశువుల అభివృద్ధి వీరి ప్రత్యేకత.

క్రమబద్ధీకరణకు డిమాండ్

'తక్కువ వేతనంతో రెండు దశాబ్దాలకు పైగా రైతులకు అందుబాటులో ఉంటున్నాం. మూగజీవాలకు వైద్య సేవలు అందిస్తున్నాం. పశు అభివృద్ధికి కృషి చేస్తున్నాం. మా గోడు వినండి. పశు సంవర్ధకశాఖలో విలీనం చేసి, బీమా భద్రత రూ.10లక్షలు అందించాలి' అని గోపాలమిత్రలు డిమాండ్ చేస్తున్నారు. పశువులకు కృత్రిమ గర్భధారణలో దేశంలోనే తెలంగాణ నంబర్ వన్ స్థానంలో ఉందని, ప్రభుత్వం తమ సమస్యలను గుర్తించి రెగ్యులర్ చేసి, ఉద్యోగభద్రత కల్పించాలని కోరుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



ఎన్నో ఏళ్లుగా గోపాలమిత్రలుగా పనిచేస్తున్నాం. చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. రెగ్యులర్ అవుతుందనే ఆశతో సేవలందిస్తున్నాం. పశు అభివృద్ధికి కృషిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలి. మా సేవలను గుర్తించి ప్రభుత్వం ఆదుకోవాలి.

– రఘురామకృష్ణగౌడ్, గోపాలమిత్ర సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు

పర్మినెంట్ చేయాలి



క్షేత్రస్థాయిలో పాడి అభివృద్ధికి కృషి చేస్తున్న తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి. కనీస వేతనాలు, ప్రమాదబీమా, ఉద్యోగభద్రత కల్పిస్తూ పర్మినెంట్ చేయాలి. తెలంగాణ రాష్ట్ర సాధనలో భాగంగా సకలజనుల సమ్మె, ఉద్యమాల్లో పాల్గొన్నాం. మా శ్రమను గుర్తించి సర్కారు ఆదుకోవాలి.

– బందెయ్య, గోపాలమిత్ర సంఘం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిందే

- లేదంటే చీపురు కట్టలతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తాం
- బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సాహు


పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

తాండూరు టౌన్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చని లేకుంటే చీపురు కట్టలతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సాహు స్పష్టం చేశారు. పార్టీ రాష్ట్ర పిలుపు మేరకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, దళిత, బీసీ బంధు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం బీజేపీ నాయకులు, కార్యకర్తలు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ముట్టడికి బయలుదేరారు. విషయం తెలుసుకున్న పోలీసులు వారిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. మహిళా కానిస్టేబుళ్లు లేకుండా తమను ఎలా అరెస్టు చేస్తారని సాహు శ్రీలత పోలీసులతో వాగ్వాదానికి దిగారు. క్యాంపు కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. పోలీసులు ఆమెతో పాటు బీజేపీ ఫ్లోర్ లీడర్ అంతారం లలిత, హారతి తదితరులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి మాట్లాడుతూ.. తొమ్మిదేళ్లుగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. ఇంటికో ఉద్యోగం, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, దళితులకు మూడెకరాల భూమి, దళిత బంధు, గిరిజన బంధు వంటి మాయమాటలతో ప్రజలను నట్టేట ముంచిందన్నారు. ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్, మున్సిపల్ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ రజినీకాంత్, పార్టీ పట్టణ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తండాలను జీపీలు చేయండి

- గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు రాథోడ్ శ్రీనివాస్ నాయక్
- ఎంపీఓకు వినతిపత్రం అందజేత


ఎంపీఓకు వినతిపత్రం అందజేస్తున్న రాథోడ్ శ్రీనివాస్ నాయక్ తదితరులు

దోమ: ఐదు వందల జనాభా కలిగిన తండాలను నూతన గ్రామ పంచాయతీలుగా చేసేందుకు చర్యలు తీసుకోవాలని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు రాథోడ్ శ్రీనివాస్ నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీఓకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఐదువందల జనాభా కలిగి తండాలు చాలా ఉన్నాయని వాటిని నూతన జీపీలుగా ఏర్పాటు చేయాలన్నారు. బడేంపల్లి అనుబంధ గ్రామాలైన పెద్దతండా, చిన్నతండా, గడ్డమీది తండాలను కలిపి నూతన పంచాయతీగా ఏర్పాటు చేయాలన్నారు. ఈ తండాలు పంచాయతీ కేంద్రానికి దూరంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌ఎచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గోవింద్ నాయక్, తండా వాసులు పాండు నాయక్, దార్యనాయక్, విస్లావత్ హన్మంతు, రమేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు ఓటరు నమోదు స్పెషల్ డ్రైవ్

అర్హులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలి: కలెక్టర్ నారాయణరెడ్డి


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: నేడు, రేపు ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి, 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరినీ ఓటర్లుగా నమోదు చేయించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ వీసీహాల్ నుంచి ఏఈఆర్‌ఓలు, ఈఆర్‌ఓలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఓటుహక్కు అర్హులను గుర్తించి, వారు తమ పేర్లను ఓటర్ జాబితాలో నమోదు చేసుకునేలా ఏఈఆర్‌ఓలు, ఈఆర్‌ఓలు ఇంటింటికీ వెళ్లి ప్రోత్సహించాలని చెప్పారు. ఓటు నమోదులో భాగంగా పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామని, బూతు స్థాయి అధికారులు సంబంధిత పోలింగ్ కేంద్రాల వద్ద ఓటరు జాబితాతో అందుబాటులో ఉండి, వచ్చే దరఖాస్తులను స్వీకరించాలని ఆదేశించారు. రెండు రోజుల అధికారులు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటరు జాబితాను పరిశీలించుకుని, ఓటరుగా నమోదు కాని వారిని గుర్తించి ఓటరుగా నమోదు చేయించాలన్నారు. 72 సంవత్సరాల కన్నా ఎక్కువ వయసు ఉన్న వారి వివరాలను సేకరించి, ఎవరైనా చనిపోయినట్లయితే వారి వివరాలను సేకరించాలని పేర్కొన్నారు. వీసీలో అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

భారీ మెజారిటీతో గెలిపిస్తాం

ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి నేతల సన్మానం


ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిని సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

యాలాల: రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా రోహిత్‌రెడ్డి రెండోసారి భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని బీఆర్‌ఎస్ మండల నాయకులు ఆశాభావం వ్యక్తంచేశారు. శుక్రవారం అధికార పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా రోహిత్‌రెడ్డి పేరును ప్రకటించడం పట్ల ఆ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రమేష్, కోఆప్షన్ సభ్యుడు అక్బర్‌బాబా, యువజన విభాగం మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ తదితరులు ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసి శాలువ, పుష్పగుచ్ఛంతో సన్మానించారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బస్వరాజ్, అగ్గనూరు ఎంపీటీసీ గరివప్ప, దేవనూరు మంత్రి వెంకటయ్య తదితరులు ఉన్నారు.

మరోసారి గెలిపిస్తాం

తాండూరు టౌన్: తాండూరు ఎమ్మెల్యేగా మరోసారి రోహిత్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తామని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీప అన్నారు. పలువురు కౌన్సిలర్లు, నాయకులతో కలిసి ఎమ్మెల్యేను హైదరాబాద్‌లో ఆమె కలిసి శుభాకాంక్షలు తెలిపి మాట్లాడారు. తాండూరులో పైలట్ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను మెచ్చి సీఎం కేసీఆర్ మరోసారి పోటీ చేసే అవకాశం కల్పించారన్నారు. కౌన్సిలర్లు అశ్విని, రాఘవేందర్, శ్రీనివాస్ రెడ్డి, భీంసింగ్, అస్లాం, వెంకన్న గౌడ్, కోఆప్షన్ సభ్యుడు వెంకట్‌రామ్, నాయకులు కమలాకర్, మాధవి, గుండప్ప, శ్రీనివాసాచారి, చెన్‌బసప్ప, సలీమ్ ఉన్నారు.

పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరికలు

ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్


బీఆర్‌ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే ఆనంద్


మర్పల్లి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు ఆకర్షితులై పలు పార్టీల చెందిన వారు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. మండలంలోని రావులపల్లి, తిమ్మాపూర్ గ్రామాలకు చెందిన వివిధ పార్టీల వారు వికారాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీటీసీ రవి, తిమ్మాపూర్ సర్పంచ్ శేఖర్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యూత్ విభాగం అధ్యక్షుడు మధుకర్, నాయకులు నరేందర్ రెడ్డి, గజ్జెల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు

వికారాబాద్ అర్బన్: ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే ఆనంద్ అన్నారు. నియోజకవర్గంలోని 24 మంది బీసీ చేతి వృత్తుల వారికి మంజూరైన లక్ష రూపాయల ఆర్థిక సహాయం చెక్కులను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ పథకం అందాలన్నదే సీఎం కేసీఆర్ లక్ష్యం అన్నారు. వికలాంగులకు రూ. 4016 పెన్షన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం మనదే అన్నారు. అనంతరం వికలాంగుల పెన్షన్లు అందజేశారు. వారితో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, కౌన్సిలర్ అనంతరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కమల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న టిప్పర్

ఇద్దరు దుర్మరణం


శేఖర్, చరణ్ మృతదేహాలు

ఆమనగల్లు: మండలంలోని మేడిగడ్డ తండా గేటు వద్ద శుక్రవారం బైక్‌ను టిప్పర్ ఢీకొనడంతో బైక్‌పై వెళుతున్న ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఆమనగల్లుకు చెందిన శేఖర్(20), చరణ్(36) ద్విచక్ర వాహనంపై అచ్చంపేటకు బయలుదేరారు. మండలంలోని మేడిగడ్డ తండా గేటు వద్దకు రాగానే కల్వకుర్తి నుంచి హైదరాబాద్ వెళుతున్న టిప్పర్ అతివేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శేఖర్, చరణ్‌లు అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆమనగల్లు ఏఎస్‌ఐ బాల్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఇదే సమయంలో అచ్చంపేట నుంచి హైదరాబాద్ వెళుతున్న ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజ్ ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతుల బంధువు కృష్ణయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు ఘటనా స్థలానికి చేరుకుని బోరున విలపించారు. బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని కోరుతూ బంధువులు ఆమనగల్లు పోలీసు స్టేషన్ వద్ద ఆందోళన చేశారు. పోలీసులు నచ్చజెప్పడంతో శాంతించారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పరిగి: మున్సిపల్‌పరిధి తుంకుల్‌గడ్డలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాలలో ఖాళీగా ఉన్న ఇంటర్ సీట్ల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ వేణుగోపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీలో 8సీట్లు, బైపీసీలో 2 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. కావున విద్యార్థులు ఈ నెల 28వ తేదీలోపు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

తలకొండపల్లి: విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకటేష్ యాదవ్ కథనం మేరకు.. బద్నాపూర్‌కు చెందిన వెంకటేష్(50) ఉదయం తన పొలానికి వెళ్లాడు. అక్కడ పశువుల షెడ్డులో స్టార్టర్‌ను బాగు చేస్తుండగా ప్రమాదవశాత్తు షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య కమలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

బంట్వారం: మతిస్థిమితం లేని ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్‌ఐ స్రవంతి తెలిపిన వివరాల ప్రకారం.. కోట్‌పల్లి మండలం నాగసాన్‌పల్లికి చెందిన మాల బాలయ్య (56) కొంత కాలంగా మతిస్థిమితం సరిగ్గా లేక ప్రవర్తించేవాడు. ఈ క్రమంలోనే మూడు రోజుల కిందట పొలం వద్ద పురుగుల మందు తాగాడు. గుర్తించిన కుటుంబీకులు వికారాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం 24న గాంధీ ఆసుపత్రికి వెళ్లగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. భార్య అనసూయ ఫిర్యాదు మేరకు పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించామని ఎస్‌ఐ తెలిపారు.

నా బలం, బలగం మీరే

షాద్‌నగర్ రూరల్: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నా బలం.. నియోజకవర్గ ప్రజలు నా బలగం అని పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్ అసెంబ్లీ అభ్యర్థి స్థానానికి శుక్రవారం ఆయన దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. ప్రజల కోసం చిత్తశుద్ధితో పని చేస్తానని అన్నారు.

బీజేపీ గెలుపునకు కృషి చేద్దాం

కర్ణాటక రాష్ట్రం హడగల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే కృష్ణనాయక్


సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణనాయక్

పూడూరు: వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలని కర్ణాటక రాష్ట్రం హడగల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే కృష్ణ నాయక్ అన్నారు. శుక్రవారం పూడూరులో ప్రవాస్ యోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు చేయలేని అభివృద్ధి ప్రధాని మోదీ చేశారని పేర్కొన్నారు. కుటుంబం కోసం పని చేస్తున్న కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో పరిగి నియోజకవర్గంలో బీజేపీ జెండాను ఎగురవేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకుడు మారుతి కిరణ్, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేష్ పటేల్, పార్టీ మండల అధ్యక్షుడు అనిల్, జిల్లా నాయకులు రాఘవేందర్, ప్రసాద్‌గౌడ్, రాజు, రవీందర్, బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

రోడ్లకిరువైపులా మొక్కలు నాటాలి

అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ


పూడూరు: అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ

పరిగి: రోడ్లకు ఇరువైపులా పెద్ద సంఖ్యలో మొక్కలు నాటాలని అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులకు సూచించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించి ఎవెన్యూ ప్లాంటేషన్‌పై సూచనలు చేశారు. నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలన్నారు. పలు గ్రామాల్లో నాటిన మొక్కలు ఎండి పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సారి మొక్కలు ఎండితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ పీడీ కృష్ణన్, డీపీఓ తరుణ్‌కుమార్, ఎంపీడీఓ శేషగిరిశర్మ తదితరులు పాల్గొన్నారు.

విరివిగా మొక్కలు నాటాలి

పూడూరు: మెగా ప్లాంటేషన్‌లో భాగంగా రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటాలని అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ సూచించారు. శుక్రవారం ఆయన మండలంలోని మన్నేగుడ, గొంగుపల్లి, చీలాపూర్, పూడూరు, దేవనోనిగుడ, తిర్మలాపూర్, సోమన్‌గుర్తి గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో మొక్కలు నాటే ప్రాంతాలు, డంపింగ్ యార్డులు, ప్రకృతి వనాలు, వైకుంఠధామాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవల్లో ప్రభుత్వం విఫలం

ఇబ్రహీంపట్నం రూరల్: పేదలకు మెరుగైన వైద్య సేవలందించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు ముదిరెడ్డి కోదండరెడ్డి ఆరోపించారు. శుక్రవారం యాచారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సందర్శించారు. ఈ సందర్భంగా కోదండరెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు అతి దగ్గరలో ఉన్న ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోకపోవడం దారుణమన్నారు. యాచారం ప్రభుత్వ ఆస్పత్రిని ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. తూతూ మంత్రంగా నిధులు కేటాయించి చేతులు దులుపుకొన్నారని అన్నారు. రాష్ట్రం ఏర్పడి పదేళ్లు కావస్తున్నా ఎలాంటి మార్పు లేదన్నారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు నిరంజన్ రెడ్డి, రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్, శ్రీధర్‌రెడ్డి, హతిరామ్, నర్సింగ్, రాము, రాహుల్, రాంబాబు, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మునగాల(కోదాడ): నగరంలోని బాలాపూర్ మండలం సాయినగర్‌కు చెందిన దేరంగుల శివకుమార్ శుక్రవారం సూర్యాపేట జిల్లా మండల కేంద్రమైన మునగాల శివారులో నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. శివకుమార్ వృత్తిరీత్యా డ్రైవర్. ఐదు నెలల క్రితం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం తుర్కగూడకు చెందిన నవీనతో వివాహం జరిగింది. దంపతుల మధ్య గొడవ జరగడంతో భార్య నవీన మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో మనస్తాపానికి గురైన శివకుమార్ గురువారం తన ద్విచక్ర వాహనంపై ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో శివకుమార్ తల్లి మీర్‌పేట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇదిలా ఉండగా.. శివకుమార్ నిద్రమాత్రలు మింగి మునగాల శివారులో పెట్రోల్ బంక్ వద్ద తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. స్థానికులు 108, 100కు డయల్ చేయడంతో వారు సంఘటన స్థలానికి చేరుకొని శివకుమార్‌ను చికిత్స నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. అతని జేబులో తాను భార్య మీద కోపంతో మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు చీటి రాసి ఉంది. దీంతో పోలీసులు బాధితుడి తల్లికి ఫోన్ చేసి సమాచారం అందించారు. శివకుమార్‌ను మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.